## క్లుప్తంగా

### యోగ సేవాకేంద్రం సేవా కార్యక్రమాలు



**తెనాలి:** శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ, పాదచారులకు మజ్జిగను పంపిణీ చేశారు. యోగ సభ్యుడు కన్నెగంటి పిచ్చయ్య, సుశీలేది కుమారుడు నరేంద్రకుమార్–కీర్తి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ సేవలను చేశారు. యోగ సేవాకేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ యోగ సభ్యులు పెళ్లి రోజు, పుట్టినరోజు, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, యార్లగడ్డ కోటేశ్వరరావు, భారతి, మురళి, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, అనూష, సావిత్రి, యోగసాధకులు పాల్గొన్నారు.

### పాలిటెక్నిక్ ఫలితాల్లో పలువురికి ర్యాంకులు



**తెనాలిఅర్బన్:** పాలిటెక్నిక్ ప్రవేశ ఫలితాల్లో తెనాలిలోని జెవీఆర్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని డైరెక్టర్ జెట్టి విజయశేఖర్ తెలిపారు. టి.రూపశ్రీ రాష్ట్ర స్థాయిలో 700 ర్యాంకు, జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు, పి.నీలికాంత్ జిల్లా స్థాయిలో 4వ ర్యాంకు, ఎస్.దివ్య, జె.శశికిరణ్‌లు మంచి ర్యాంకులు సాధించారని చెప్పారు. వీరిని ప్రకాశం రోడ్డులోని కోచింగ్ సెంటర్‌లో గురువారం అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### తెనాలి చేరిన నోటుబుక్స్, యూనిఫామ్స్



**తెనాలిఅర్బన్:** సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, యూనీఫాం, నోటుబుక్స్, బెల్టులు, బ్యాగ్‌లను గురువారం తెనాలి పంపారు. వాటిని పట్టణంలోని స్టాక్ పాయింట్‌లలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఎంఈవో–2 జయంతిబాబు మాట్లాడుతూ తెనాలి పరిధిలో పంపిణీ చేసేందుకు ఇప్పటి వరకు 9618 బ్యాగ్‌లు, 32 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయని చెప్పారు. బ్యాగ్‌ల నాణ్యత ప్రమాణాన్ని పరిశీలించిన తరువాత మాత్రమే పంపిణీ చేస్తామని తెలిపారు. మిగిలిన కిట్స్ త్వరలో వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–1 మేకల లక్ష్మీనారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొనండి



**తెనాలిఅర్బన్:** సీఐటీయు ఆధ్వర్యంలో ఈ నెల 22న జరిగే సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొనాలని జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ కోరారు. మారీసుపేటలో గురువారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీస వేతనాన్ని ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంగళగిరి పద్మ, దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ, వై.అంజి, రోహిణి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి 20లోగా దరఖాస్తు చేసుకోవాలి

**ఎంఈఓ పులి లాజరు**

**చెరుకుపల్లి:** ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యా శాఖాధికారి–2 పులి లాజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి సీటు సాధిస్తే ఆరేళ్ల పాటు ఉచిత విద్య ఉంటుందన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా సీటు కేటాయించటం జరుగుతుందని, జూన్ 5న జాబితా విడుదల, అదే నెల 11న సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ఆర్జీయూకేటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# అగ్ని ఆరదు.. పొగ ఆగదు..!

- రైల్వే స్థలంలో చెత్త తగులబెడుతున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు
- రాజీవ్ గృహకల్ప వాసులకు పొగతో తీవ్ర ఇబ్బందులు



గృహకల్ప ఎదురు ఉన్న రైల్వే స్థలంలో తగలబడుతున్న చెత్త

**తెనాలిరూరల్:** ఖాళీగా ఉన్న రైల్వే స్థలాన్ని పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది చెత్త కలెక్షన్ పాయింట్‌గా వినియోగించుకుంటున్నారు. అంత వరకు ఆగితే బాగుండేది. కలెక్షన్ పాయింట్‌గా ఉంచకుండ అక్కడ చెత్తను తగులబెడుతున్నారు. పొగ కారణంగా అక్కడ సమీపంలో నివసించే వారు ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి–రేపల్లె రైలు మార్గంలో రాజీవ్ గృహకల్ప వద్ద రైలు పట్టాల వెంబడి రైల్వే శాఖకు చెందిన స్థలం ఉంది. ఇక్కడ గతంలో చెత్త కలెక్షన్ పాయింట్‌గా స్థలంలో కొంత భాగాన్ని వినియోగించుకునేవారు. తరువాతి కాలంలో అటు రైల్వే శాఖ నుంచి వచ్చిన ఆదూశాలు, పురపాలక సంఘం తీసుకున్న నిర్ణయం కారణంగా ఈ స్థలం వెంబడి రాజీవ్ గృహకల్ప ఎదురు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

రైల్వే స్థలంలోని ఎవరూ వెళ్లకుండా ఈ చర్యలు తీసుకున్నారు. కొన్నాళ్లకు ఫెన్సింగ్‌ను కొద్దిమేర తొలగించి తిరిగి చెత్తను డంప్ చేయడం ప్రారంభించారు. అక్కడితో ఆగకుండ చెత్తను తగులబెడుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పొగవల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గృహకల్ప ఉత్తరం వైపున ఉన్న బ్లాకుల్లోని వారికి ఇబ్బందులు తప్పడం లేదు. రాజీవ్ గృహకల్ప నిర్మాణం జిల్లాలోనే తొలిసారిగా తెనాలిలో చేపట్టారు. 2005లో ఇందుకు శ్రీకారం చుట్టగా, నత్తనడకన సాగిన పనులతో ఈ భవన సముదాయం 2009లోగాని ప్రారంభానికి నోచు కోలేదు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ. 5.28 కోట్ల వ్యయంతో 15 బ్లాకులతో 480 ఫ్లాట్ల నిర్మాణానికి తలపెట్టినా, అప్పటికీ 13 బ్లాకులు మాత్రమే నిర్మించగలిగారు. దీంతో కేవలం 416 లబ్ధిదారుల కుటుంబాలకు ఇంటి వసతి ఏర్పడింది. మిగిలిన రెండు బ్లాకుల నిర్మాణం నిలిచిపోయింది. ఇక్కడ ఉత్తం వైపున ఉన్న బ్లాకుల్లోని వారికి పొగ వల్ల తిప్పలు తప్పడం లేదు. ఇదిలా ఉంచితే రైల్వే స్థలాన్ని ఆక్రమంగా వినియోగించుకోవడమే కాకుండా, చెత్తను తగులబెడుతూ ప్రజల ప్రాణాలతో మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు సిబ్బంది చెలగాటమాడడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> **ఇబ్బందులు లేకుండా చూస్తాం**
>
> గృహకల్ప వద్ద ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. చెత్త కలెక్షన్ పాయింట్‌ను పరిశీలించి తగులబెట్టకుండా చర్యలు తీసుకుంటాం. గురువారం నుంచే చర్యలకు ఉపక్రమిస్తాం.
>
> –బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్

## పుణ్యకార్యాలతోనే మానవ జన్మ చరితార్థం

**గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి**



రామలింగాచారికి చెక్కు అందజేస్తున్న మునగాల బాబుజీ

**తెనాలిటౌన్:** పుణ్యకార్యాలతో మానవ జన్మచరితార్థమవుతుందని గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో గురువారం శాశ్వత నిత్య అన్నదాన పథకానికి దాత మునగాల బాబుజీ రూ.51,116లు చెక్కును విరాళంగా అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి చెక్కును అందించారు. ఈ సందర్భంగా రామలింగాచారి మాట్లాడుతూ మునగాల బాబుజీ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆశ్రమ శాశ్వత నిత్య అన్నదాన పథకానికి భారీ విరాళం అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సేవా నిరతిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పుణ్యకార్యాలతోనే పుణ్యాత్ములు అవుతారని హితువు పలికారు. కలిగిన వారందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు అవగాహన పెంపొందించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

**తెనాలిటౌన్:** ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని బాపట్ల వ్యవసాయకళాశాల విద్యార్థులు సూచించారు. రూరల్ మండలం కొలవరం గ్రామంలో గురువారం రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై విద్యార్థులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పంటల్లో వచ్చే తెగుళ్ళ నివారణకు పాటించవాల్సిన పద్ధతులు వివరించారు. సేంద్రీయ విధానంలో జీవామృతం తయారు చేయడాన్ని ప్రయోగాత్మకంగా తెలియజేశారు. వేసవిలో దుక్కులు దున్నుకోవడం వలన భూమి గుళ్ళబారి వర్షాలు పడే సమయానికి భూసారం పెంపొందుతుదని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు తెలియజెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శాంతి, సుధ, శిరీష, సౌమ్య, సింధూజ, రేవతి. రమ్య, రాధిక, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మురుగు కాల్వల్లో సిల్ట్ పూర్తిగా తొలగించండి

**మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక**



అధికారులకు సూచనలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

**తెనాలిఅర్బన్:** మురుగు కాల్వల్లో ఉన్న సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. చెంచుపేటలో గురువారం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాలవలపై కొందరూ రాళ్లను ఏర్పాటు చేయడాన్ని గమనించిన ఆమె వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రధాన మురుగు కాల్వల పూడికతీత పనులను చేస్తున్నట్లు చెప్పారు. కాల్వల్లో వచ్చిన సిల్ట్‌ను వెంటనే బయటకు తరలించాలన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ కోమరబత్తిని జయపాల్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## మొక్కల పెంపకంతో ఉష్ణోగ్రతలు తగ్గించవచ్చు

**మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు**




మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

**రేపల్లె:** మొక్కల పెంపకం ద్వారా ఉష్ణోగ్రతలను తగ్గించి జీవవైవిధ్యాన్ని పెంపొందించవచ్చునని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు చెప్పారు. ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న 'బీట్ ద హీట్' కార్యక్రమంపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ప్రజా సంఘాల నాయకులు, మెప్మా, మున్సిపల్, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెట్ల నరికివేత, అడవులు అంతరించిపోవడం, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల వినియోగం పెరగడంతో పగటి ఉష్ణోగ్రతలు అధికమై జన జీవన మనుగడకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఉష్ణోగ్రతలను తగ్గించుకోవడానికి మొక్కల పెంపకమే ప్రధాన మార్గమని చెప్పారు. ఈ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి మొక్కల పెంపకంలో భాగస్వాములను చేయాలన్నారు. పెరటి తోటలు, మొక్కలు పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించి ఆ దిశగా చర్యలు చేపట్టేలా చైతన్య పరచాలని కోరారు. వేసవిలో పక్షులు, జంతువుల కోసం గృహాలపై చిన్న తొట్టెలు ఏర్పాటు చేసి నీటితో నింపాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం అనునిత్యం చేజర్ల కృషి

**మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి**

**బాపట్ల:** బాపట్ల పురపాలక సంఘంలో వరుసగా ఐదుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొంది వార్డు అభివృద్ధి కోసం నిత్యం కృషి చేసిన చేజర్ల కోటేశ్వరమ్మ ఆదర్శనీయులని మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు పేర్కొన్నారు. చేజర్ల కోటేశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నరాలశెట్టి మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలుగా నాలుగైదు సార్లు గెలిచినవారు ఉంటారే గానీ కౌన్సిలర్లుగా ఐదుసార్లు గెలిచిన వారు చేజర్ల కోటేశ్వరమ్మ ఒక్కరే ఉన్నారని గుర్తు చేసుకున్నారు. బాపట్లలోని నిత్యం రద్దీగా ఉండే చంద్రకళా పార్కులో కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మందపాటి ఆంధ్రయ, కళ్ళం హరినాథ్ రెడ్డి, విన్నకోట సురేష్, పల్లం సరోజిని, కూచిపూడి ఝాన్సీ, కారుమూరి అంజనేష్, కూచిపూడి శ్యాంసుందర్, అల్లం గోపికృష్ణ, కాగిత దిలీప్, ఐనంపూడి శాలెం రాజ్, అడే వంశీ, కోటికలపూడి సురేష్, ఇంటూరు వంశీ తదితరులు పాల్గొన్నారు.

### తప్పించుకుని తిరుగుతున్న నిందితుడి అరెస్ట్

**తెనాలిరూరల్:** కోర్టు వాయిదాలకు హాజరుకాని నిందితుడిపై అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. తెనాలి మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన గండికోట గోపి అలియాస్ పవన్ కళ్యాణ్‌పై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 2021లో గంజాయి కేసు నమోదైంది. పోలీసులు అప్పట్లో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ అనంతరం బెయిల్‌పై వచ్చిన అతను 2023 నుంచి కోర్టు వాయిదాలకు హాజరవకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో గోపిని రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ గురువారం అరెస్ట్ చేశారు.


### తెనాలి పట్టణ సుందరీకరణకు చర్యలు

**మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న**



**తెనాలిఅర్బన్:** తెనాలి పట్టణ సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. చెంచుపేట కోనేరు బజారులో గురువారం ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే పట్టణంలోని 2వ శానిటేషన్ డివిజన్ పరిధిలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పర్యటించారు. తెనాలి పట్టణంలో నూరుశాతం చెత్త సేకరణ జరిగే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### ప్రారంభమైన పోలేరమ్మ కొలుపులు



**కర్లపాలెం:** పాతనందాయపాలెం గ్రామ దేవత పోలేరమ్మ కొలుపులు గురువారం ప్రారంభమయ్యాయి. కొలుపులలో మొదటి రోజు గ్రామంలోని మహిళా భక్తులు జలబిందెలు శిరస్సుపై ధరించి మంగళవాయిద్యాలతో గ్రామంలో జల బిందెలతో ఉత్సవం నిర్వహించి పోలేరమ్మ విగ్రహానికి జలాభిషేకం చేశారు. శుక్రవారం పోలేరమ్మకు నైవేద్యాలు సమర్పించటంతో పాటు మల్లెపూలతో పూజలు నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి నగరోత్సవం, ఆదివారం అమ్మవారి తిరునాళ్ల, భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తామని చెప్పారు. సోమవారం భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకోవటంతో కొలుపులు ముగుస్తాయని తెలియజేశారు.

### అక్రమంగా మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకుంటాం

**ఆర్డీవో ఎస్ రామలక్ష్మి**



**నగరం:** అక్రమంగా మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని రేపల్లె ఆర్డీవో ఎస్.రామలక్ష్మి చెప్పారు. మండలంలోని పూడివాడ, సిరిపూడి, చినమట్లపూడి, పెదమట్లపూడి గ్రామాలలో అక్రమంగా మట్టి తరలించిన ప్రాంతాలను గురువారం ఆర్డీవో పరిశీలించి మాట్లాడారు. నిబంధనలను అతిక్రమించి చేపట్టిన అక్రమ మట్టి తవ్వకాలపై నివేదికలను సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాంచారయ్య, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

## సరస్వతి నది పుష్కరాల్లో బాలస్వామి



కాళేశ్వరంలో పుష్కరాల్లో శ్రీబాలస్వామీజీ

**తెనాలి:** తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో గురువారం ఆరంభమైన సరస్వతి నది పుష్కరాల్లో పెనుగొండ పీఠాధిపతి, తెనాలికి చెందిన బాలస్వామీ పాల్గొన్నారు. తెల్లవారుజామున 5.45 గంటలకు పుష్కరుడు ప్రవేశించే సమయంలో గోదావరి ప్రాణహిత అంతర్వాహినిగా సరస్వతి నది అయిన త్రివేణి సంగమానికి విశేషంగా అర్చన కైంకర్యాలు, అమ్మవారికి వస్త్రాలు, మంగళ ద్రవ్యాలు, విశేష హారతి, శ్రీచక్రసానం కార్యక్రమంలో బాలస్వామీజీ భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి 12 సంవత్సరాలకు ఓసారి, ప్రతి నదికి పుష్కరాలు వస్తాయని గుర్తుచేశారు. ఈ సంవత్సరం మిథున రాశిలో బృహస్పతి ప్రవేశించడం వలన సరస్వతి నదికి పుష్కరాలు జరుగుతున్నాయని చెప్పారు. బద్రీనాథ్ క్షేత్రం మానాను ప్రాంతం దగ్గర సరస్వతి నది బాహ్యంగా కనిపిస్తుందనీ, ఆ తర్వాత అంతర్వాహినిగా ఉంటుందని తెలిపారు. బద్రీనాథ్ క్షేత్రంలో ప్రయాగ్‌రాజ్ దగ్గర, దక్షిణ భారతదేశంలో కాళేశ్వరంలో మాత్రమే సరస్వతి నది పుష్కరాలు జరుగుతాయని చెప్పారు. బద్రీనాథ్ ప్రాంతందాకా వెళ్లలేనివారు కాళేశ్వరానికి వచ్చి పుష్కర స్నానం ఆచరించడం వల్ల, పుష్కరుడి దివ్య అనుగ్రహం, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, పితృదేవతలు అనుగ్రహం కూడా కలుగుతుందన్నారు. బాలస్వామీజీతో తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు గుంటూరు జిల్లా అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, సాలగ్రామ మఠం ఉపాధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, నిడమానూరి నరసింహారావు, జీఎంఆర్ రెసిడెన్సి అధినేత రమేష్ దంపతులు, కాళేశ్వరం ప్రాంతంలోని స్వామీజీ శిష్యులు, భక్తులు విశేషంగా స్నానమాచరించారు. అన్నప్రసాద వితరణ కైంకర్యాన్ని నిర్వహించారు.

## వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నారు

**ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి**



కొలకలూరులో రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

**తెనాలి:** కేంద్రప్రభుత్వం పథకం ప్రకారం వ్యవసాయరంగాన్ని కుదేలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆరోపించారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులోని శ్రీకృష్ణమందిరం వద్ద గురువారం ఆయన రైతులతో మాట్లాడారు. ఈ సంవత్సరం ధాన్యం, పెసర, మిర్చి, పొగాకు, జొన్న తదితర పంటల ధరలు పడిపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం పెసలు, మినుములు జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవటంలో గల ఆంతర్యం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ఎన్నికల సందర్భంలో ప్రధాన నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా 200 బహిరంగ సభల్లో, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేస్తామని ఆర్భాటంగా ప్రచారం చేసిన విషయాన్ని సాంబిరెడ్డి గుర్తుచేశారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత దీన్ని అమలు చేయటం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో దాఖలు చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతులు, కౌలు రైతులకు రూ.20 వేల ఆర్థికసాయం అందిస్తామని చెప్పి ఏడాది గడచినా, ఆర్థికసాయం ఊసే లేదని విమర్శించారు. కౌలు రైతులకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించిన కూటమి పార్టీల నాయకులు, అధికారంలోకి వచ్చాక కొత్త సీసీఆర్సీ కార్డులు ఇస్తామని చెప్పి ఏడాది అవుతోందని గుర్తుచేశారు. ఇప్పటికీ సీసీఆర్సీ కార్డులు ఇవ్వనందున కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. అరవై ఏళ్లు నిండిన రైతులు, కౌలురైతులకు ఏటా రూ.10 వేల చొప్పున పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికవర్గం చేస్తున్న సమ్మెకు రైతులు, కౌలు రైతులు మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో గంపల భూషయ్య, కాజా కోటేశ్వరరావు గంపల వాసుదేవరావు, బసవశంకరరావు, రాఘవయ్య గంపల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంగీత కళాకారుడు పెద్దిరాజు సంస్మరణ

**తెనాలి:** పట్టణానికి చెందిన ప్రముఖ కీ–బోర్డు కళాకారుడు, బ్యాండు గ్రూపు నిర్వాహకుడు తాడివలస వెంకట పెద్దిరాజు సంస్మరణ కార్యక్రమం గురువారం అయితానగర్‌లోని రజకపేటలో నిర్వహించారు. సంస్మరణ సభకు సంగీత దర్శకుడు, 'ఇస్కఫ్' జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో హైదరాబాద్, విశాఖపట్నం, ఒంగోలు, చెన్నైల్లో జరిగిన కార్యక్రమాల్లో తెనాలి వారి 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' నృత్యనాటిక, పోస్టర్ నాటికలకు పెద్దిరాజు సంగీత దర్శకత్వం వహించారని చెప్పారు. 'రక్తకన్నీరు' నాగభూషణం, సినీ నటులు జమున, మాదల రంగారావు, దర్శకుడు టి.కృష్ణ ప్రశంసలను అందుకున్నారని చెప్పారు. టి.రామారావు సంగీత బ్యాండ్ నిర్వాహకుడిగానూ రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో వందలాది ప్రదర్శనలిచ్చారని గుర్తుచేశారు. వివిధ నగరాలకు చెందిన నాదస్వర విద్వాంసులు టి.రమణ, జె.శ్రీనివాస్, టీవీ రామసుబ్బయ్య, కె.గోవిందరావు తమ ప్రసంగాల్లో పెద్దిరాజు సంగీత ప్రతిభను వివరించారు. రాష్ట్రం నలుమూలల్నుంచి సంగీత కళాకారులు హాజరయ్యారు. తొలుత పెద్దిరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సభానంతరం హైదరాబాద్ కళాకారులచే నాదస్వర కచేరీ చేశారు. పెద్దిరాజు కుమారులు టి.శ్రీఆంజనేయ, రాఘవేంద్ర, జగపతిలు విద్వాంసులను సత్కరించారు.

## కౌలు కార్డులపై అవగాహన ఉండాలి

**ఏవో సుమంత్ కుమార్**



మాట్లాడుతున్న ఏవో సుమంత్‌కుమార్

**కర్లపాలెం:** కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన పెంపొందించుకోవాలని ఏవో సుమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని కర్లపాలెం, చింతాయపాలెం గ్రామాలలో గురువారం వ్యవసాయాధికారులు కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రెవెన్యూ అధికారుల సహకారంతో కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గుర్తింపు కార్డులు కావలసిన రైతులు తాము సాగు చేస్తున్న భూమి పాస్ పుస్తకం జిరాక్స్, కౌలుదారుని ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నంబరు గ్రామాలలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వటం వలన భూమి రైతుకు ఎలాంటి నష్టం వాటిల్లదని కౌలు రైతుకు సాగు చేసిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందని ఏవో తెలిపారు. కౌలు గుర్తింపు కార్డు ఉన్నప్పుడే పంట నమోదు, పంటల బీమా, పంట నష్ట పరిహారం వంటివి పొందేందుకు వీలు కలుగుతుందని ఆయన చెప్పారు. భూసారం పెంపొందించుకునేందుకు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీపై ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచామని కావలసిన రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలి

**ఏవో బాలాజీ గంగాధర్**

**చెరుకుపల్లి:** ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని గూడవల్లి, రాజవోలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం కౌలు రైతు కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ కౌలు రైతులు కార్డులు పొందటం ద్వారా ప్రభుత్వం అందించే అన్ని రాయితీలు పొందవచ్చన్నారు. కౌలు కార్డులు పొందేందుకు భూయజమాని పట్టాదారు పాస్‌పుస్తకం నకలు, ఆధార్ నకలు, కౌలు రైతు ఆధార్, ఫొటోతో ఆయా గ్రామాలలోని గ్రామ వ్యవసాయ సహాయకులను గానీ, రెవెన్యూ అధికారులను గానీ సంప్రదించి కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.